క్లుప్తంగా

పద్యకవి వెంకురెడ్డి కన్నుమూత



నెల్లూరు(బృందావనం): పద్యకవి, ప్రముఖ సాహితీవేత్త అగస్త్యరెడ్డి వెంకురెడ్డి (84) శుక్రవారం కన్నుమూశారు. విజయమహల్ గేట్ సమీపంలోని వేదంవారి అగ్రహారంలో ఆయన వయోభారంతో తుదిశ్వాస విడిచారు. భగవద్గీత గ్రంథాన్ని గీతా సుధాలహరి పేరుతో పద్యాల్లోకి ఆయన అనువదించారు. ఆయన పార్థివదేహానికి పలువురు నివాళులర్పించారు. కవులు పెరుగు రామకృష్ణ, గంగిశెట్టి శివకుమార్, కరుణశ్రీ, టేకుమళ్ల వెంకటప్పయ్య, జయప్రకాష్ సంతాపం తెలియజేశారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సింగిల్ నంబర్లాటపై ఎస్సై వేణుగోపాల్ శుక్రవారం దాడులు చేశారు. నలుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,100ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ చెస్ పోటీలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నవాబుపేటలోని కేపీఆర్ కల్యాణ మండపంలో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైవీఆర్ఆర్ ట్రాన్స్‌పోర్ట్స్ సౌజన్యంతో నిర్వహించనున్న పోటీల్లో విజేతలకు రూ.రెండు లక్షల నగదు బహుమతులు, జ్ఞాపికలు, తదితరాలను అందజేయనున్నామని వివరించారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతిని కల్పించనున్నామన్నారు. పోటీలకు దేశవ్యాప్తంగా 300 మంది అగ్రశ్రేణి క్రీడాకారులతో పాటు ఫిడే టైటిల్ ప్లేయర్స్ తమ పేర్లను నమోదు చేసుకున్నారని వివరించారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 91456 29999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (టౌన్): దేశం కోసం పాటుపడిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పొణకా కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. మహిళా విద్య కోసం పొణకా కనకమ్మ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పొణకా కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి, బేరమ్మ చిత్రపటాలను కళాశాల యాజమాన్యానికి అందజేశారు. పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ గిరి, తెలుగు భాషోద్యమ సమితి కోశాధికారి భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కోఆర్డినేటర్ లక్ష్మీసునంద, సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేదాంత దేశికర్ దేవస్థానంలో పూజలు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేట గోపురం వీధిలోని వేదాంత దేశికర్ దేవస్థానంలో కొలువైన ఆదివణ్ శఠగోపస్వామి తిరునక్షత్ర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. స్వామివారికి సుప్రభాతసేవ, శ్వేతఛత్ర పల్లకి ఉత్సవం, స్నపన తిరుమంజనం, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, ఆదివణ్ శఠగోపస్వామికి పేట ఉత్సవాన్ని కనులపండువగా జరిపారు.

'డీకేడబ్ల్యూ'లో విద్యార్థినులకు అవగాహన



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో పెడల్ ఫర్ ఫ్రీడమ్ 23 న్యాయసలహా, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సైకిల్ యాత్ర చేస్తూ కళాశాలకు విచ్చేసిన విద్యార్థినులు వివిధ అంశాలను తెలియజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆచార్య సంపత్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, రెడ్‌రోప్ ప్రతినిధి క్రిస్టోఫ్లై, ప్రిన్సిపల్ గిరి, అనిత, నాగశ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డెయిరీల దోపిడీకి చెక్

- మరుపూరులో పూర్తయిన బీఎంసీయూ భవన నిర్మాణం
- అమూల్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు
- పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్న పాడిరైతులు

పొదలకూరు : పాడి పరిశ్రమకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వ సహకార డెయిరీలను అమూల్‌తో భాగస్వామ్యం చేసి గ్రామాల్లో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లను(బీఎంసీయూ) ఏర్పాటు చేస్తోంది. తద్వారా పాలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా మండలంలోని మరుపూరులో బల్క్ మిల్క్ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసింది. అందులో అమూల్ పాల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ప్రైవేట్ డెయిరీల దోపిడీ నుంచి పాడిరైతులకు ఉపశమనం కలగనుంది. మండలంలో వరిసాగు గణనీయంగా పెరగడంతో పశువుల మేతకు ఎండుగడ్డి పుష్కలంగా లభ్యమవుతోంది. నాలుగేళ్లుగా వర్షాలు బాగా పడుతుండడంతో మేతపొరంబోకుల్లోనూ పచ్చిగడ్డి బాగా లభ్యమవుతోంది. ఫలితంగా పాల దిగుబడి ఏటా పెరుగుతున్నట్టు రైతులు చెబుతున్నారు. రెండు గేదెలను మేపుకొంటే కుటుంబం ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుందనే ఉద్దేశంతో పాడిని నమ్ముకుని రైతులు జీవిస్తున్నారు. వ్యవసాయం కన్నా పాడిపరిశ్రమే మేలని చాలామంది రైతులు నమ్మి డెయిరీ ఫామ్స్‌ను సైతం నిర్వహిస్తున్నారు.



మరుపూరులో నిర్మించిన బీఎంసీయూ భవనం

మండలంలో పాల వెల్లువ

మండలంలోని ప్రతి గ్రామంలో పాడి గేదెలు ఉన్నాయి. తాటిపర్తి, మహ్మదాపురం, సూరాయపాళెం, విరువూరు, నేదురుమల్లి, వెలికంటిపాళెం, తదితర పెన్నార్ డెల్టా గ్రామాల్లో పాడిపరిశ్రమ అధికంగా ఉంది. నీటి లభ్యత ఇక్కడ బాగా ఉండడంతో రైతులు పాడిని నమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మండలంలో 26 వేల గేదెలు, 2,500 తెల్ల పశువులు(ఆవులు, ఎద్దులు) ఉన్నాయి. వీటిలో పాడి గేదెలు, ఆవులు సుమారు 10 వేల వరకు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతినిత్యం సుమారు 30 వేల లీటర్ల పాల దిగుబడులు వస్తున్నాయి. అందులో 20 వేల లీటర్ల పాలను విజయ డెయిరీతో పాటు ప్రైవేట్ డెయిరీలకు పోస్తున్నారు. మిగిలిన 10 వేల లీటర్ల పాలను స్థానికంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని తోడేరు, దుగ్గుంట, పొదలకూరులో నాలుగు ప్రైవేట్ శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఏజెంట్ల ద్వారా పాలను సేకరిస్తున్నాయి. ఇక్కడి నుంచి బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ డెయిరీలకు ఎగుమతి చేస్తున్నాయి.

మోడల్‌గా మరుపూరు గ్రామం

సర్వేపల్లి నియోజకవర్గంలోనే తొలిసారిగా మరుపూరులో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ భవనంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో అమూల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామపెద్దలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకుని మిగిలిన పంచాయతీల్లోనూ అమూల్‌ను తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. మరుపూరులోని పాడి రైతులు ప్రతి నిత్యం రెండు వేల లీటర్ల పాలు వివిధ ప్రైవేట్ డెయిరీలకు పోస్తున్నారు. వారు సిండికేట్‌గా మారి రైతుల పొట్ట కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వెన్న శాతం పేరుతో లీటర్‌కు రూ.40 కంటే అదనంగా అందజేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లుగా తెలుస్తోంది. మరుపూరులో అమూల్‌ను ఏర్పాటు చేస్తే ప్రైవేట్ డెయిరీలు దిగి వచ్చి గిట్టుబాటు ధరలు అందించే అవకాశం ఉంది.



డెయిరీఫామ్‌లో పాడిగేదెలు

పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి



ప్రస్తుతం మండలంలో ప్రైవేట్ డెయిరీల దోపిడీ ఎక్కువగా ఉంది. మరుపూరులో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ భవనం పూర్తయింది. మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లగా అమూల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించేందుకు చర్యలు చేపట్టారు. అమూల్ కేంద్రం ఏర్పాటు చేస్తే పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి.

–వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, వైస్ఎంపీపీ, మరుపూరు.

పంట నమోదు తప్పనిసరి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

కోవూరు(విడవలూరు): ఖరీఫ్ సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జేసీ కూర్మనాథ్ సూచించారు. మండలంలోని పార్లపల్లిలో పంట నమోదును క్షేత్రస్థాయిలో శుక్రవారం జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. జేసీ వెంట విడవలూరు తహసీల్దార్ హమీద్, ఏఓ వెంకటకృష్ణయ్య, ఆర్ఐ రమేష్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ట్రాన్స్‌కో ఏడీ శీనయ్య, ఏఈ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కోవూరు: ప్రజారోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భవ హెల్త్ క్యాంపులపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆయుష్మాన్ భవ హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రం ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల స్థితిగతులను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కోవూరు సీహెచ్‌సీలోని పురిటి బిడ్డల వార్డులో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా మూడు ఏసీలను ఏర్పాటు చేశారని వివరించారు. సీహెచ్‌సీలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం వైద్యులు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ విజేత, డాక్టర్ చలపతి గౌడ్, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జ్యోత్స్న, వేణుగోపాల్, యోడెం లక్ష్మీకుమారి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, అనూప్‌రెడ్డి, దౌలత్, వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచు మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం

కొడవలూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పొదుపు సభ్యులకు అవగాహన అవసరమని వైకేపీ ఏపీఎం ఎస్ రుక్మిణి అన్నారు. మండల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పొదుపు సభ్యులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉంటే వాటిని సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. జీవనోపాధులను మరింత మెరుగుపరుచుకోవడం ద్వారా ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి చెందుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం కూడా సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ మిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, ప్రవీణ, కోశాధికారి సుశీల, సీసీలు ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం రుక్మిణి

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

పొదలకూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామనగర్ గేట్ సెంటరులో శివపార్వతుల కల్యాణాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా వాకాటి శ్రీనివాసులురెడ్డి, సంధ్య దంపతులు వ్యవహరించారు.



క్రీడాకారులకు అభినందన

మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు టీ అజయ్‌కుమార్, సీహెచ్ నిఖిల్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో పొదలకూరులో నిర్వహించిన పోటీల్లో సత్తాచాటి కబడ్డీ, వాలీబాల్ జట్లకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం డేవిడ్, పీడీ సరిత శుక్రవారం అభినందించారు.



డ్రైడేపై అవగాహన కల్పించండి

నెల్లూరు(బారకాసు): ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ సూచించారు. కిసాన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని శ్రీనివాసనగర్, బీఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే, జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. అపరిశుభ్ర కాలువలు, చెత్త కుప్పలు, నీటి నిల్వలను గుర్తించాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ సర్వేలో ప్రతి ఇంటినీ సందర్శించి జ్వరపీడితులను గుర్తించి వారికి ఇంటి వద్దే మలేరియా, డెంగీ పరీక్షలను నిర్వహించాలని పేర్కొన్నారు. పాజిటివ్ వస్తే సంబంధిత యూపీహెచ్‌సీ వైద్యాధికారికి సమాచారమిచ్చి వెంటనే చికిత్సను అందించాలన్నారు. వైద్యాధికారి సునీల్‌బాబు, డాక్టర్ అస్విత, కో ఆర్డినేటర్ వేణు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య చర్యలను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నారని ఎంపీడీఓ నగేష్‌కుమారి శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు తాటిపర్తిలో పేదలకు పట్టాలు అందజేస్తారని చెప్పారు. అనంతరం పొదలకూరులో రూ.26 లక్షలతో ఈద్గా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మండలాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని వివరించారు. అనంతరం పట్టణ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమై పార్టీ పటిష్టతకు దిశానిర్దేశం చేయనున్నారు.

జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు పౌష్టికాహారం

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోందని రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ పరిశీలకులు శారదాకుమారి, అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం వారు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యాకానుక పంపిణీ, విద్యా సౌకర్యాలపై విద్యార్థులను ఆరాతీశారు. వారి వెంట అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, ఎంఈఓ దిలీప్, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, హెచ్ఎం శ్రీనివాసులరెడ్డి, సీఆర్పీ మల్లీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి కాకాణికి రుణపడి ఉంటాం

పొదలకూరు : ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు చేయించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ముస్లిం మైనార్టీలందరూ రుణపడి ఉంటారని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన ముస్లిం మైనార్టీలు శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్‌బోర్డ్ జాయింట్ సెక్రటరీ ఎస్‌కే ఖాదర్, మైనార్టీ నాయకుడు ఎస్‌కే అంజాద్ మాట్లాడుతూ ఇటీవల ముస్లిం పెద్దలతో కలిసి తాము మంత్రి కాకాణికి ఈద్గాలోని సమస్యలను విన్నవించామని తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే ఈద్గా చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు చేయించారని చెప్పారు. ఈద్గాలో ప్రార్థనలు చేసేందుకు ప్లాట్‌ఫాం, రేకుల షెడ్, తదితర నిర్మాణాలకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. శనివారం ఈద్గా ప్రహరీ నిర్మాణ పనులకు మంత్రి కాకాణి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఎంతో కాలంగా ఈద్గాలో సౌకర్యాలు లేక ముస్లింలు ఇబ్బందులు పడుతుంటే ఏ నాయకుడు స్పందించి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈద్గాలోని సమస్యలపై వెంటనే స్పందించి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రికి ముస్లిం మైనార్టీల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, ముస్తాక్‌మదానీ, నౌరోజ్, పట్టణంలోని మసీదుల ముతవలీలు, మతపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

తోటపల్లిగూడూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా మండలంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్‌గా రెండో దఫా తన నియామకానికి సహకరించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో మరో దఫా మండల పార్టీ బాధ్యతలను అప్పగించడం సంతోషకరమన్నారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, ఇతర నాయకుల సహకారంతో మరోదఫా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయానికి శాయాశక్తుల కృషి చేస్తామన్నారు. వైస్ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, ఎంపీటీసీలు ఇనకళ్ల సరస్వతి, బల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప్పల శంకరయ్యగౌడ్

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం

వెంకటాచలం: మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. తిక్కవరప్పాడు, కాకుటూరు, కంటేపల్లి, తదితర గ్రామాల్లో వినాయకుడు విగ్రహాల గ్రామోత్సం నిర్వహించారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముత్తుకూరు: వినాయక చవితి సందర్భంగా పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలను కృష్ణపట్నం తీరంలో శుక్రవారం నిమజ్జనం చేశారు. ముత్తుకూరులోని ఆర్అండ్ఆర్ కాలనీ, పిడతాపోలూరు, బ్రహ్మదేవి, పంటపాళెం, నారికేళపల్లి, తదితర గ్రామాల్లోని వినాయకుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం కృష్ణపట్నం తీరానికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. రిలయన్స్ కాలనీ, బ్రహ్మదేవి, తదితర గ్రామాల్లో అన్నదానం, ఉట్టి మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు, కాటేపల్లి తీరప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. వినాయక చవితి సందర్భంగా మండలంలోని వాడవాడలా కొలువుదీరిన గణనాథులను ఐదో రోజైన శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను కోడూరు, కాటేపల్లి సాగర తీరానికి తరలించి నిమజ్జనం చేశారు. గణేశ్ నిమజ్జనానికి భక్తులు పోటెత్తి రావడంతో బీచ్‌ల్లో కోలాహలం నెలకొంది. స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మనుబోలు: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్య విగ్రహాలను ఐదోరోజైన శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. వినాయకుడి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని వాగుల్లో నిమజ్జనం చేశారు. పిడూరురోడ్డులోని వినాయక మండపం వద్ద భారీ స్థాయిలో అన్నదానం చేశారు.



ముత్తుకూరు: నిమజ్జనానికి తరలివెళ్తున్న సోమిదేవమ్మపాళెం గణనాథుడి విగ్రహం



వెంకటాచలం: తిక్కవరప్పాడులో వినాయకుడి గ్రామోత్సవం



కోడూరు తీరంలో..



మనుబోలు: పిడూరురోడ్డులో అన్నదానం